www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 08 | నవంబర్ | 2025
పేజీలు : 8

## స్వాతంత్ర్యోద్యమంలో స్ఫూర్తినింపిన గేయం 'వందేమాతరం'




వందేమాతరం గీతాలాపనలో ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ శ్రీజ

3లో

# నకిలీ దందా..కల్తీ కల్లోలం..!




**-ఏది అసలో.. ఏది నకిలీనో తెలుసుకోలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

**-ఆహార పదార్థాల కల్తీతో అనారోగ్యాలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మార్కెట్‌లోకి అసలు వచ్చిన కొన్ని గంటల్లోనే నకిలీ పుట్టుకొస్తుంది. ఇది నిత్యం వాడుకునే వస్తువుల దగ్గర నుంచి బట్టలు, సాంకేతిక పరికరాలు సహా అన్నింటికి ఈ నకిలీలు తయారవుతున్నాయి. ఈ నకిలీల కారణంగా అసలు ఏదో నకిలీ ఏదో అర్థం కాక వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. బ్రాండెడ్ ఉత్పత్తులకు సైతం చిన్న అక్షరాల తేడాతో నకిలీలు తయారవుతున్నాయి. నకిలీలను సైతం అసలు ధర కంటే ఒక రూపాయి ఎక్కువే విక్రయిస్తుండటం శోచనీయం. ఈ వస్తువుకు నకిలీ ఉంది. ఈ వస్తువుకు లేదు అనేది లేకుండాపోయింది. దైనందిన జీవితం ప్రారంభమయ్యే పేస్టు దగ్గర నుంచి మొదలుకుని ప్రతి దానికి ఒక నకిలీ పుట్టుకొచ్చింది. సబ్బులు, తల నూనెలు మొదలుకుని అన్ని వస్తువుల్లో నకిలీలు దర్శనమిస్తున్నాయి. అన్నింటి కంటే ప్రమాదకరంగా ఆహార పదార్థాలకు నకిలీ ఉత్పత్తులను సృష్టించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. వివిధ అనారోగ్యాలకు గురైన వారు వాడుతున్న మందుల్లో పెద్ద ఎత్తున నకిలీలు తయారవుతున్నాయి. చాలా మందుల దుకాణాల్లో వినియోగదారులకు ఈ నకిలీలను అంటగడుతున్నారు. అసలు ఖరీదులో పదవ వంతుకే కొందరు నకిలీ మందులను దుకాణాలకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ డూప్లికేట్ వ్యవస్థను నియంత్రించడానికి తగిన యంత్రాంగం లేదు.

మిగతా 2లో..

# అక్రమ తోలకాలు..!



**- అర్థరాత్రి వేళ ఇసుక, మట్టి రవాణా**
**- ఊరి శివార్లలో డంపింగ్ యార్డులు**
**- అధిక ధరలకు విక్రయాలు**
**- పట్టించుకోని అధికారులు**

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం కేంద్రంగా పలు చీకటి వ్యాపారాలు విచ్చల విడిగాసాగి పోతున్నాయి. ప్రస్తుతం మట్టి, ఇసుక అక్రమ తోలకాలకు హద్దు అదుపు లేకుండా పోయింది. ఇడిగే వాడే లేన్నప్పుడు అక్రమానికి అదుపేముంది అన్నట్లు అక్రమార్కులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారు. ఏపిలో ఉన్న కొల్లుగూడెం రేవులోకి అర్థరాత్రి వేళ ట్రాక్టర్లతో వెళుతున్న అక్రమ వ్యాపారులు ఇసుకను ఎలాంటి అనుమతి లేకుండా నిత్యం వందలాది ట్రాక్టర్లతో తోలుతున్నారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక ర్యాంపులు ఉన్నప్పటికీ ఆ ర్యాంపుల ద్వారా ఇసుక తెచ్చుకోవాలంటే ఇబ్బంది, పద్ధతితో కూడుకున్న పని కావడంలో కొద్ది మొత్తాల్లో ఇసుక కావాల్సిన వారు ట్రాక్టర్ల యజమానులను ఆశ్రయిస్తున్నారు. సుతారీ మేస్త్రీలు సైతం ఈ అక్రమానికి వంత పాడుతూ పనులు జరిగే ప్రదేశాలకు కమీషన్ల తీసుకుని మరీ తోలకాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రివేళల్లో కొల్లుగూడెం ఇసుక ర్యాంప్ నుండి వచ్చే ఒక ట్రక్కు ఇసుక సుమారు రూ.3000 నుండి రూ.3500 వరకు ధర పలుకుతోంది. ఇసుక

మిగతా 2లో..

మన యోధులు ..2

# కమ్యూనిస్టు 'గిరి శిఖరం' దేవూరి






**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగం పొంది నేను సుఖ పడటం కాదు నాతో పాటు నా చుట్టూ ఉన్న ప్రజలు కూడా స్వేచ్ఛగా జీవించాలి, హక్కులను అనుభవించాలని ఆలోచించిన మహోన్నత కమ్యూనిస్టు గిరిశిఖరం దేవూరి శేషగిరిరావు. అనేక నిర్బంధాలను అధిగమించి తెల్లదొరల దౌర్జన్యాలకు ఎదురొడ్డి నైజాం రక్కసి మూకలకు ఎదురు నిలిచి సాహసంతో పోరాటమే ఊపిరిగా జీవించిన అత్యుత్తమ కమ్యూనిస్టులలో దేవూరి శేషగిరి ఒకరు. తుదిశ్వాస వరకు కమ్యూనిస్టుగా జీవించిన ఆయన సాయుధుడై అప్పటి నిజాం ప్రభుత్వాన్ని గడగడలాడించాడు. గెరిల్లా దళ నాయకునిగా విజయవాడలో తర్ఫీదు పొందిన ఆయన భద్రాచలం ప్రాంతంలో సింగరేణిలో కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు విశేష కృషి చేశారు. సింగరేణిలో యూనియన్ వ్యవస్థాపకుల్లో ఒకరైన దేవూరి శేషగిరిరావు నెల్లూరు జిల్లా పాపిరెడ్డి పాలెంలో

మిగతా 2లో..

# నకిలీ దందా..కల్తీ కల్లోలం..!

(మొదటిపేజీ తరువాయి)



విత్తనాలు, పురుగుమందులు నకిలీలు వినియోగంలోకి రావడంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవడంతో పాటు ఉత్పత్తి రంగంపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. నగదుకు నకిలీ నోట్లు వచ్చాయి. బంగారం నకిలీది వినియోగదారులకు అంటగడుతున్నారు. నోట్ల నకిలీ కారణంగా నష్టపోతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. ఇవాళ అత్యంత ఖరీదైనదిగా చెబుతున్న బంగారానికి కూడా నకిలీది మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. హాల్ మార్క్ అంటూనే నకిలీది అంటగడుతుండటం శోచనీయం. మద్యం ప్రియులు సేవించే మద్యంలోనూ నకిలీ మద్యం మార్కెట్‌లో విచ్చలవిడిగా చెలామణి అవుతుంది. నకిలీ ధృవపత్రాల సృష్టి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నకిలీ ధృవపత్రాలతో ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు దొరికి పోతున్నారు. అన్నింటికి మించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చాలా మందికి ప్రధాన వృత్తిగా మారడం, అతిపెద్ద ఆర్థిక లావాదేవీలతో ముడిపడి ఉండడంతో అసలు భూ ఆధార ధృవ పత్రాలకు నకిలీలు పుట్టుకొస్తున్నాయి. అసలు యజమానులు నకిలీ ధృవపత్రాల సృష్టి కారణంగా ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. విద్యార్థులను ముఖ్యంగా శిక్షణ కేంద్రాల్లో మోసం చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పుడు నకిలీకి ఈ వస్తువు ఉంది దీనికి లేదనేది లేకుండా అన్నింటికి నకిలీలు పుట్టుకొస్తున్నాయి. ఇక కల్తీలు ప్రతి దానిలోనూ కల్తీలే. కళాయిలో నూనె పోసి కమ్మని పదార్థాలు తయారు చేసుకుందామన్న ఆలోచన ఉండగానే బుస్సున పొంగి వంటగది పొగమయం అవుతుంది. చూస్తే నూనె ప్యాకెట్‌పై బ్రాండ్ నేమ్ అలాగే ఉంటుంది. ఇటీవల కాలం లో నూనెల కల్తీలు ముఖ్యంగా ద్రవ పదార్థాల్లో కల్తీలు తారాస్థాయికి చేరాయి. ఆహార పదార్థాలు కల్తీలు జరుగుతుండడంతో ప్రజలు రోగాల భారీన పడుతున్నారు. ప్రజలకు కలిగే అనారోగ్యానికి సంబంధించి ఎక్కువ భాగం ఆహార పదార్థాల ద్వారానే జరుగుతుందని వైద్యులే ప్రకటిస్తున్నారు. వైద్యులు కూడా నకిలీలు దర్శనమిస్తున్నారనుకోండి. ఆహా ర పదార్థాల కల్తీ కారణంగా అనారోగ్యాల భారీన పడుతున్న వారి సం ఖ్య పెరగడంతో కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్ర జల సంపాదనలో సింహ భాగం వైద్య ఖర్చులకే సరిపోతుంది. అనారోగ్యానికి ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నకిలీ, కల్తీకి సంబంధించి నిరంతరం అధికార యంత్రాంగం వివిధ దుకాణాల్లో పరిశీలనలు జరపాల్సి ఉంది. కానీ ఆ దిశగా అధికార యంత్రాంగం పనిచేయక పోగా వ్యాపారులతో రాజీపడుతున్నారన్న భావన ప్రజల్లో బలపడింది. కొన్నింటిని నియంత్రించే అవకాశం లేకపోయినా మరికొన్నింటిని నియంత్రించే అవకాశం ఉన్న అధికార యంత్రాంగం వైఫల్యం కా రణంగానే అరికట్ట లేని పరిస్థితి. క్రమం తప్పకుండా అధికార యంత్రాం గం తనిఖీలు నిర్వహిస్తే కల్తీలు, నకిలీలను అరికట్టే అవకాశం ఉంది. ఎక్కడో ఏదో ప్రమాదం జరిగితే తప్ప అధికార యంత్రాంగం ఆ వైపు దృష్టి సారించడం లేదు. ఫిర్యాదులు వచ్చిన అంతగా స్పందించడం లేదన్న విమర్శలను అధికారులు ఎదుర్కొంటున్నారు. కొన్ని శాఖల అధికారులు కుర్చీలకు, నెల వారి వసూళ్లకే పరిమితం అవుతున్నారన్న తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కల్తీ, నకిలీలతో సమాజానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఉత్పత్తి పడిపోవడం ఒక పక్క మరోక పక్క విని యోగదారులు పెద్ద మొత్తంలో నష్టపోవడం, అనారోగ్యాల బారీన పడటం జరుగుతుంది. కల్తీ, నకిలీలను అరికట్టేందుకు విశాల ప్రాతిప దికన ఒక కార్యాచరణ చేపట్టాల్సి ఉంది. లేకపోతే సమాజం మరిన్ని ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తుంది.

# అక్రమ తోలకాలు..!

(మొదటిపేజీ తరువాయి)

కొరతతో పనులు ఆపుకునే పరిస్థితి లేకపోవడంతో ఇంటి యజమానులు సైతం అధిక మొత్తాల్లో వెచ్చిస్తున్నారు. అంతే కాకుండా ఊరి శివారు ప్రాంతాల్లో డపింగ్ యార్డులు ఏర్పాటు చేసుకుని నిల్వలు చేసి అక్కడ్నుంచి జేసిబిల ద్వారా ట్రాక్టర్లలోనికి రోడ్ చేయించి పట్టణంతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో ఇసుక అక్రమ వ్యాపారం విచ్చల విడిగా సాగుతోంది. ఇదిలా ఉండగా గ్రావెల్ తోలకాలు సైతం పెద్ద ఎత్తున సాగుతున్నాయి. సీతారామ ప్రాజెక్టులో భాగంగా కాల్వలు తొవ్విన సమయంలో వచ్చిన మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా తోలుతున్నారు. అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో అధిక మొత్తంలో ఇలాంటి మట్టి లభ్యం అవుతుండటంతో ట్రాక్టర్ల యజమానులు ఒక్క పైసా ప్రభుత్వానికి చెల్లించకుండా వందలాది లోడ్‌ల మట్టి తోలకాలు పెద్దఎత్తున సాగిస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ మట్టి ధర రూ.1100 నుండి రూ.1500 వరకు పలుకుతోంది.

## పట్టించుకునే వారే కరువు...

అక్రమ ఇసుక, మట్టి తోలకాల వ్యవహారంపై పట్టించుకునే వారే కరువయ్యారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన వారికి ముడుపులు చెల్లిస్తున్నాం అంటూ అక్రమార్కులు బహాటంగానే చర్చించడం కొసమెరుపు. ఇసుక ర్యాంపుల నుండి ఇసుక తోలకాలు సాగిస్తే డిడిలు తీసుకుని ఓ పద్ధతి ప్రకారం చేయాల్సి ఉంటుంది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరుతుంది. కానీ సమీప సరిహద్దు గోదావరి నుండి ఇసుకను రాత్రివేళల్లో తమకు ఇష్టం వచ్చినట్లు తోలుతూ నిబంధనలు గోదాట్లో కలిపేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రాత్రివేళల్లో సాగే అక్రమ ఇసుక, గ్రావెల్ తోలకాలపై దృష్టి సారించి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

# ప్రజా మరుగుదొడ్ల కోసం ఎదురుచూపు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రజా మరుగుదొడ్లు కోసం ప్రజలు ఎదురు చూపులతో ఎదురుచూస్తున్నారు. పట్టణంలోని రద్దీగా ఉండే ప్రాంతాలైన ఎంపీడీవో కార్యాలయం, స్త్రీ శక్తి భవనం, ఉపాధి హామీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం లతోపాటు సబ్ కలెక్టర్ కార్యాలయం, ఎన్ఎస్పి కార్యాలయాలు, ఐసిడిఎస్ కార్యాలయం, సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆయా ప్రాంతాలలో ప్రజా మరుగుదొడ్ల కోసం ప్రజలు చాలా కాలం నుండి ఎదురుచూపులతో చూస్తూ ఉన్నారు. ఆయా కార్యాలయాల వద్దకు నిత్యం గ్రామీణ ప్రాంతాల నుంచి ధ్రువీకరణ పత్రాలు, రిజిస్ట్రేషన్ల కొరకు ప్రతిరోజు వారి అవసరాల కొరకు వస్తూ పోతూ ఉంటారు. ఆ సమయంలో ఒంటికి రెంటికి పురుషులు స్త్రీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామీణ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. గతంలో మంజూరైన కూడా వాటిని పట్టించుకోకుండా వదిలేశారని ప్రజలు చర్చించుకుంటున్నారు. స్త్రీ శక్తి భవనం వద్దకు ప్రతినెల 4 సార్లు సమీక్ష సమావేశాలు మహిళా సంఘాలు పలు అంశాలపై సమీక్ష సమావేశాలు జరుగుతూ ఉంటాయి. అదే విధంగా ఉపాధి హామీ కార్యాలయంలో నెలవారి సమీక్షలు ఉద్యోగులతో పాటు కూలీలతో సమీక్ష సమావేశాలు, అవగాహన సమావేశాలు జరుగుతాయి. అదేవిధంగా ఎంపీడీవో కార్యాలయం రైతు వేదికల వద్ద ప్రజలతో ఉద్యోగుల తో సమావేశాలు ప్రతినెల జరుగుతూ ఉంటాయి. ఈ సమావేశాలకు వస్తూ పోయే స్త్రీ పురుషులు కు సరైన మరుగుదొడ్లు లేనందున స్త్రీ, పురుషులు ఇబ్బందులు పడుతున్నట్లు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టిలో ఉన్నా కూడా ఏమీ పట్టనట్లుగా ఉంటున్నారని ఒకరినొకరు చర్చించుకుంటున్నారు. గతంలో ఉన్న ప్రతిపాదనలు ప్రకారం మరల పరిశీలించి ప్రజా మరుగుదొడ్లను నిర్మించాలని మండల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# కమ్యూనిస్టు ‘గిరి శిఖరం’ దేవూరి

(మొదటిపేజీ తరువాయి)



1918 సెప్టెంబర్ ఎనిమిదిన జన్మించారు. శేషగిరిరావుకు నలుగురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. నెల్లూరి వెంకటగిరి రాజా వారి కళాశాలలో చదువుతున్నప్పుడే కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలను ఏర్పరచుకున్నారు. 1939లో కొత్తగూడెంలోని బాబు క్యాంపులో సింగరేణి ప్రధాన కార్యాలయంలో అకౌంటెంట్‌గా ఉద్యోగంలో చేరారు. సింగరేణిలో కార్మికులు అనుభవిస్తున్న దుర్భర దారిద్ర్య పరిస్థితులను అవగతం చేసుకోవడంతో పాటు కాంట్రాక్టర్ల దోపిడీ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించి కాంట్రాక్టర్ల దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటు బావుట ఎగురవేశారు. రాఘవరావు, మనుబోతుల కొమరయ్య, పర్సా సత్యనారాయణ తదితరులతో కలిసి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి రహస్యంగా పునాదులు వేశారు. అప్పటి కమ్యూనిస్టు నాయకులు మగ్దూం మోహినుద్దీన్, రాజ్‌బహదూర్ గౌడ్ లతో సంబంధాలు ఏర్పరచుకుని సింగరేణిలో యూనియన్ బలోపేతానికి కృషి చేశారు. బొగ్గు బావుల్లోకి దిగి కార్మికుల స్థితిగతులను తెలుసుకునే వారు. అప్పట్లోనే శేషగిరి కార్యదర్శిగా చలపతిరావు, పర్సా సత్యనారాయణ, మనుబోతుల కొమరయ్య, వంగా రాజేశ్వరరావు, కుమారస్వామి తదితరులతో యూనియన్ నిర్వహణకు ఒక కమిటీని వేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రిజిస్ట్రేషన్‌కు అప్పుడే ప్రాతిపదిక ఏర్పడగా 1944లో యూనియన్ రిజిస్ట్రేషన్ జరిగింది. అప్పటి వరకు భారతదేశంలో రెండే యూనియన్లు రిజస్టర్ కాబడ్డాయి. ఒకటి రైల్వే, రెండవది అజాంజాహి మిల్ వర్కర్స్ యూనియన్. శేషగిరిరావు కాంట్రాక్టర్ విధానాన్ని ఎత్తివేయాలని, వేతనాలను పెంచాలని, బావుల్లో సౌకర్యాలు కల్పించాలని పోరాడారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో కరువు వచ్చినప్పుడు సింగరేణి కార్మికుల కోసం పోరాడి సహచర నాయకులతో కలిసి ప్రత్యేక రేషన్ ఇప్పించడంలో శేషగిరి కృతకృత్యులయారు. 1945 జూన్ 16న యూనియన్ మొదటి సమావేశం జరిగింది. బెల్లంపల్లి తదితర ప్రాంతాల్లో ఉన్న కార్మికులను సైతం సమీకరించి కొత్తగూడెంలో మహాసభ నిర్వహించారు. ఈ సమయంలోనే శేషగిరి దూకుడును గమనించిన అప్పటి ప్రభుత్వం ఆయనను, ఆయన సహచరులను అంతం చేయాలని భావించింది. కొందరు కిరాయి గుండాలతో శేషగిరి మరి కొంత మంది నాయకులపై హత్యాయత్నం చేశారు. ఇది తెలిసిన ప్రజలు పెద్ద ఎత్తున తిరుగుబాటు చేశారు. గుండాలను తరిమి తరిమి కొట్టారు. ఎవరైతే శేషగిరిరావు తదితరులను హత మార్చాలని చూశారో ఆ కాంట్రాక్టర్ల ఇండ్లను నేలమట్టం చేసి ప్రజాశక్తిని చాటారు. ఒక దశలో యూనియన్ ఆఫీసులో ఉండగా వందలాది మంది పోలీసులు యూనియన్ కార్యాలయాన్ని చుట్టుముట్టి శేషగిరిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న గని కార్మికులు కర్రలు, గడ్డపారలు, చెమ్మాస్ పట్టుకుని వచ్చి శేషగిరిని అరెస్టు చేయడానికి వీలు లేదంటూ పోలీసులను అడ్డుకోవడంతో పాటు చాకచాక్యంగా తమలో కలుపుకుని శేషగిరిని అక్కడి నుంచి తప్పించారు. అనాటి నుంచి శేషగిరి అజ్ఞాతంలోనే గడిపారు. 1947 ఫిబ్రవరిలో ఒక కాంట్రాక్టర్ సమాచారం ఇవ్వగా శేషగిరిని అరెస్టు చేసి చంచలగూడ జైలుకు తరలించారు. ఒక కేసు విచారణ నిమిత్తం చంచల గూడ జైలు నుంచి ఇల్లందుకు తీసుకుని వస్తుండగా డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో పోలీసులు ఆగారు. శేషగిరి ని డోర్నకల్ తీసుకు వచ్చారన్న సమాచారం తర్వాతే శేషగిరి అరెస్టు బయటకు పొక్కింది. జైలు నుంచి విడుదలైన తర్వాత విజయవాడలో శిక్షణ పొంది గెరిల్లా దళాల ఆవిర్భావానికి ఆయన పునాదులు వేశారు. గుంపెన సాయుధ దళ పోరాటం తర్వాత 10 మంది చొప్పున చిన్న చిన్న దళాలను ఏర్పాటు చేసి వాటిని సమన్వయం చేస్తూ శేషగిరి సాయుధ ఉద్యమాన్ని ముందుకు నడిపారు. పాల్వంచ ప్రాంతంలో శేషగిరి నేతృత్వంలోని సాయుధ దళం దాడి చేసి పోలీస్ క్యాంపును చిన్నాభిన్నం చేసి కాశీం అనే రజాకార్ నాయకున్ని హత మార్చారు. గోదావరి నది ఇవతల తుమ్మల చెరువు ప్రాంతానికి ఇద్దరు సహచరులతో కలిసి వెళ్తుండగా ఒక కార్మిక ద్రోహి ఇచ్చిన సమాచారంతో నిజాం పోలీసులు శేషగిరిని చుట్టుముట్టి 1948 ఫిబ్రవరి 15న శేషగిరితో పాటు కంగాల పాపయ్య, ఒంటెద్దు రంగయ్యలను కాల్చి చంపారు. శేషగిరిని చంపిన విషయాన్ని దాచేందుకు అప్పటి పాలకులు, నిజాం పోలీసులు నానా తంటాలు పడ్డారు. అప్పటి హిందు దిన పత్రికలో శేషగిరిని కాల్చి చంపిన విషయం ప్రచురితం కావడంతో వేలాది హృదయాలు ద్రవించాయి. అమరుడు శేషగిరి కమ్యూనిస్టుగా, అటు సింగరేణి కార్మికుల్లోనూ, సామాన్య ప్రజల్లోనూ తనదైన ముద్ర వేశారు. ఆయన త్యాగం, పోరాటం భవిష్యత్తు తరాలకు దిక్సూచిగా వదిలి అమరుడయ్యాడు. శేషగిరి మరణ వార్త తెలిసిన తర్వాత అప్పటి సాయుధ దళ నాయకునిగా ఉన్న నల్లమల ప్రసాద్ శేషగిరిలోని గిరిని తన పేరు ముందుంచుకుని నల్లమల గిరిప్రసాద్‌గా మారాడు. నల్లమల గిరిప్రసాద్ కమ్యూనిస్టుగా ఎదిగి ఖమ్మం శాసన సభ్యునిగా, రాజ్యసభ సభ్యునిగా, రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా పని చేసిన విషయం విధితమే. శేషగిరి లాంటి యోధుల త్యాగాలు, పోరాటాలతో పునితమైన ఖమ్మం ఉద్యమ గడ్డపై డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవ సంబర ముగింపు సభ జరగనుంది.

# సమానత్వం.. సామాజిక న్యాయమే సోషలిజం లక్షణాలు




**ప్రజాపక్షం/సత్తుపల్లిః** సమానత్వం సామాజిక న్యాయమే సోషలిజం లక్షణాలని సిపిఐ (ఎం ) ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బేతుపల్లి లో జరిగిన పార్టీ గ్రామ శాఖ సమావేశంలో పాల్గొన్న జాజిరి మాట్లాడుతూ రష్యా విముక్తి కోసం, సాగిన ఉద్యమం ప్రపంచ గతిని మార్చేసిందన్నారు. మనలాంటి దేశాల్లో స్వాతంత్ర పోరాటాన్ని రగిల్చిందన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టేందుకు తోడ్పడటమే కాకుండా,స్వతంత్ర్యం తరువాత సొంత కాళ్ళ మీద నిలబడేందుకు సహకరించిందన్నారు. అక్టోబర్ విప్లవం భారతీయులకు మార్గదర్శనం అని సూచించారు. మరోసారి లెనిన్ చూపిన బాటలో సాగాల్సిన అవసరం ఉందని ప్రజలకు పిలిపునిచ్చారు. సోషలిజమే మన దేశాన్ని నూతన దిశ వైపుకు నడిపిస్తుందన్నారు. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి హామీ ఇచ్చే సమాజం కావాలని, కార్మికులకు హక్కులు, రైతులకు భద్రత, యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చే సమాజం, ప్రజలకు అధికారం, మంచి సమాజం కోసం దాన్ని ఉపయోగించడం కోసం జరిగే పోరాటంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కువ్వారపు లక్ష్మణరావు, కావూరి వెంకటేశ్వరరావు, పొలాసి భాగ్యమ్మ, పొదిలి సత్యం, కొపూరి వెంకటలక్ష్మి , మహేశ్వరి, రాంబాబు, రమాదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్యోద్యమంలో స్ఫూర్తినింపిన గేయం 'వందేమాతరం'





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వందేమాతరం గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా।। పి.శ్రీజ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తినింపిన వందేమాతరం గేయానికి నేటితో 150 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. వందేమాతరం గేయంలోని ప్రతి పదం దేశ భక్తి భావనతో నిండి భారతదేశం ఒకటేనని గర్వంగా చెబుతుందన్నారు. ఈ గీతం మన దేశ ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీక అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ భావనను మనసులో నిలుపుకోవాలని తెలిపారు. వందేమాతరం గేయం ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందన్నారు. దేశ చరిత్రలో ఈ గేయం విశేష ప్రాధాన్యత కలిగి ఉందని ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్నట్లు ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి

**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు**



**ప్రజాపక్షం/బోనకల్‌:** డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మోటమర్రి సిపిఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో హలో కామ్రేడ్స్..ఛలో ఖమ్మం అంటూ ఇంటింటి ప్రచారాన్ని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుతో కలిసిఆయన 3వ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ 1925 డిసెంబరు 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భవించిందని అన్నారు. దోపిడికి పాల్పడుతున్న వర్గాలకు వ్యతిరేకంగా మార్క్స్ సిద్ధాంతాన్ని ఆచరిస్తూ ఎన్నో విజయాలు సాధించదని తెలిపారు. వేలాది మంది త్యాగాలతో ఈ విజయాలు సాధ్యమైనవని అన్నారు. ఈ వంద సంవత్సరాల ఉద్యమాలను, పోరాటాలను, విజయాలను ప్రజలకు వివరిస్తూ మరింత పట్టుదలతో సిపిఐ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. మోటమర్రి గ్రామంలో అమరులు మరీదు హన్మంతు, వంగాల బసవయ్య, మరీదు నరసింహరావు సిపిఐ అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. అమరుల ఆశయ సాధనలోనే నేటికి సిపిఐ సభ్యులు, నాయకులు నడుస్తున్నారన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ చరిత్ర, పోరాటాలు, ప్రజల పక్షాన సాధించిన విజయాలను నేటి తరాలకు తెలియజేస్తూ శతాబ్ది ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు, కార్యదర్శి వంగాల కృష్ణ, వంగాల బ్రహ్మం, వంగాల నరేంద్ర, సహకార మాజీ వైస్ ప్రసిడెంట్ గుడిద వెంకటేశ్వర్లు, వంగాల నాగేశ్వరావు, గీత పనివారుల సంఘం అధ్యక్షులు మరీదు మల్లయ్య, వంగాల నారాయణ, మరీదు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు లాభదాయకం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఆయిల్ పామ్ సాగు రైతులకు ఎంతో లాభదాయకమని కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్ తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం రైతు వేదిక నందు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ సాంప్రదాయ పంటలైన వరి, పత్తి, మిర్చి వంటి పంటలు కాకుండా ఆయిల్ పామ్ వంటి పంటలను రైతులు సాగు చేసి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. తాము 30 ఏళ్లుగా ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తూ అంతర పంటలుగా కోకో, వక్క, మిరియాలు వంటి బహుళ పంటలను సాగు చేస్తూ అధిక లాభాలు పొందుతున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుందని, కోతుల బెడద ఉండదన్నారు. మార్కెట్ సౌకర్యం ఉన్న పంట అని తెలిపారు. ప్రభుత్వం కూడా ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు రాయితీలు అందిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సదస్సులో అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని ఉద్యానవన శాఖ, గోద్రెజ్ కంపెనీ వారికి సూచించారు. శాస్త్రవేత్త డా।। కిరణ్ ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఏఎంసి మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, గోద్రెజ్ కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ చావా వెంకటేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, జిల్లా రైతు కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, మందడపు సుధాకర్, వాంకుడోత్ దీప్లానాయక్, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రివ్యూ మీటింగ్స్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించాలి

**ప్రజాపక్షం/ మధిర :** టెక్నాలజీతో ప్రపంచం పరుగెతుంటే ఖమ్మం జిల్లా ఉపాధ్యాయులు రివ్యూ మీటింగ్‌లో ప్రత్యక్షంగా పాల్గొనడానికి ఖమ్మం పరుగెత్తాల్సి వస్తుందని, రివ్యూ మీటింగ్‌లను ప్రత్యక్షంగా కాకుండా జూమ్ ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని పిఆర్‌టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి మధిర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలె సుధాకర్ పేర్కొన్నారు. మధిర, ఎర్రుపాలెం, వేంసూరు, సత్తుపల్లి, తిరుమలాయపాలెం, సింగరేణి మండలాల నుండి ఒక్కరు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పిల్లలకు పెట్టి ఖమ్మం రివ్యూ మీటింగ్ రావడం చాలా కష్టతరంగా ఉందని, తరచూ రివ్యూ మీటింగ్‌ల పేరుతో ఖమ్మంవెళ్లడంతో విద్యాబోధన కుంటుపడుతుందని అన్నారు. అనేక సందర్భాల్లో డిఇఓకు ఉపాధ్యాయుల సంఘం విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదన్నారు. జూమ్ మీటింగ్ లాంటి వాటితో రివ్యూ మీటింగ్స్ నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు. ఈ ప్రకటన చేసిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్‌వి రవి కుమార్, మండల బాధ్యులు పిల్లి నరసింహారావు, ఎండి.జమీర్, ఎల్.అప్పారావు, కె.శాంతబాబు, మల్లెల శ్రీనివాస్, తెల్లమేక శ్రీనివాసరావు, టి.అజయ్, టి.అనసూయ తదితరులు ఉన్నారు.

# రెజొనెన్స్‌లో వందేమాతర గేయ వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరం శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్‌లో స్వాతంత్ర్య సమరంలో ఒక మంత్రంగా భారత జాతిని చైతన్యం చేసిన వందేమాతరం గేయం నేటికి 150 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వందేమాతర గేయ ఆలాపన చేసి వేడుకలను శుక్రవారం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు పాల్గొని మాట్లాడుతూ వందేమాతర గేయం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నిరంకుశ పరిపాలన నుండి భరత మాతకు స్వేచ్ఛను కల్పించుటకు భారతజాతి సమైక్యత కొరకు ఒక మంత్రంగా పని చేసిందన్నారు. వందేమాతర గేయ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణ, ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించి దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పివిఆర్ మురళీమోహన్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ఘనంగా వందేమాతర వేడుకలు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వందేమాతరం గేయం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని పాఠశాలల్లో వందేమాతర ఆలాపన నిర్వహించారు. గణేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాలలో వేడుకల్లో భాగంగా 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విద్యార్థులు 150వ ఆకారంలో నిల్చుని వందేమాతర ఆలాపన చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గోపాలరావు మాట్లాడుతూ వందేమాతర గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. ఈ గేయాన్ని బంకించంద్ర చటర్జీ రచించారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కౌసల్య, రాధ, పంచాయతీ కార్యదర్శి రాజు, సిబ్బంది వీరన్న, రవి, పాషా, స్థానికులు ఉపేందర్, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో వందేమాతర వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో వందేమాతర గేయం రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వందేమాతర గీతాలాపన నిర్వహించారు. విద్యార్థులతో 150 నెంబర్ ఫార్మేషన్ చేయించారు. ఎన్‌సిసి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ వందేమాతర గీతం భారత ఆత్మను ప్రతిభింభించిన నినాదం, అమ్మ అన్న పిలుపులోని అప్యాయత, ప్రేమ, భక్తి కలగలిసిన సంక్షిప్త కావ్యం, కేవలం ఇది ఒక పాట కాదని ఒక జాతిని మేల్కొపిన శక్తి అన్నారు. వందేమాతర గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిందన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతర గీతం ఉద్యమకారులకు మనో భావాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి సంస్థల అధిపతి వై.వెంకటేశ్వరరావు, సిఆర్‌వో మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా, స్వప్న, క్యాంపస్ ఇంచార్జిలు చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం సానుభూతిపరుడు అయ్యప్ప మృతి



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని మల్లారం గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతి పరుడు మందడపు అయ్యప్ప(80) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం పార్టీ బృందం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు, పార్టీ మండల కార్యదర్శి మందా సైదులు, మాజీ సర్పంచ్ ఉపేంద్ర, పట్టణ కార్యదర్శి షేక్.ఉద్దండుసాహెబ్, పార్టీ మండల కమిటీ సభ్యులు గౌర్రాజు ధనలక్ష్మి , మహిళశాఖ కార్యదర్శి గుండ్లపల్లి రమణ తదితరులు ఉన్నారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం





**ప్రజాపక్షం/ మధిర :** అన్నం పరబ్రహ్మ స్వరూపమని జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు రంగా శ్రీనివాసరావు అన్నారు. మధిర పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం నందు శుక్రవారం దాతల వితరణతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ దానాల్లో కల్లా అన్నదానం మిన్న అని, ప్రతిఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజుల సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, అన్నదాతలను ప్రోత్సహించాలని కోరారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కపిలవాయి జగన్మోహన్‌రావు, చారుగుండ్ల నర్సింహామూర్తి, మిరియాల వెంకటరమణగుప్తా, కాజా చక్రధర్‌రావు, కొల్లా శ్రీనివాసరావు, భవిరిశెట్టి సాంబశివరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, కోనా శ్రీనివాసరావు, జల్లా రాధాకృష్ణమూర్తి, కొత్తమాసు రామారావు, దాతలు వేణుగోపాలరావు స్వరాజ్యలక్ష్మి , దొడ్డ వెంకటనారాయణ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గేయం వేడుకలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జాతీయ గేయం వందేమాతరం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గేయాలపన కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో నాగపద్మజ, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు. ఏపీవో సునీత తదితరులు పాల్గొన్నారు. మండలం లోని వివిధ ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ గేయం యొక్క విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## వసతి గృహంలో హెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గల ఎంజేపి టిబిసి గర్ల్స్ బాలాజీ నగర్ నందు శుక్రవారం హెల్త్ క్యాంప్ నిర్వహించి వారి వారి రుగ్మతలను బట్టి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ పిల్లల్లో ఎక్కువగా చర్మ సంబంధమైన స్కేబీస్, డెర్మటైటిస్, కాన్టిపేషన్ వంటి సమస్యలు ఉన్నాయన్నారు. కొందరిని హాస్పిటల్ కు రిఫర్ చేయడం జరిగింది అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, లో తడి దుస్తులు ధరించరాదని, వకరి దుస్తులు మరొకరు ధరించరాదని, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని, నీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, కృష్ణ, అనసూర్య, జ్యోతి పాల్గొన్నారు.

## సిఎంపిఎఫ్ పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంప్‌ల నిర్వహణ

**ప్రజాపక్షం/మణుగూరు:** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 4.0 లో భాగంగా దేశ వ్యాప్తంగా అన్ని సంస్థల పెన్షనర్స్ లో "డిజిటల్ సాధికారత" పెంచాలనే ఉద్దేశం తో పెన్షనర్స్ అందరూ తమ ఆండ్రాయిడ్ మొబైల్ నుండే మొబైల్ అప్లికేషన్ ద్వారా సిఎంపిఎఫ్/ సిపిఆర్ఎంఎస్ డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పించేందుకు అవగాహన కల్పించేందుకు క్యాంపులను నిర్వహించాల్సిందిగా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దానికి అనుగుణంగా సింగరేణి సంస్థ కోల్ మైన్ ప్రావిడెంట్ సంస్థల ఆధ్వర్యంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంప్ లను నిర్వహించబోతున్నాము అన్నారు. కార్యక్రమంలో భాగంగా మణుగూరు ఏరియాలో ఈ నెల 10వ తేదీ ఉదయం 10.00 గంటలకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంప్ ను కమ్యూనిటీ హాల్, పివి కాలనీ నందు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కావున సిఎంపిఎఫ్ పెన్షన్ పొందుతున్న సింగరేణి మాజీ ఉద్యోగులు, సిపిఆర్ఎంఎస్ కార్డు దారులు ఈ అవకాశమును సద్వినియోగ పరచుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## రోడ్డు మరమ్మతులకు నిధులు విడుదల చేయాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఏ రేగా కాంతారావు ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని మండలాల్లో రోడ్డు మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం విఫలం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, గుంతలమయమైన రహదారులపై డిజిటల్ క్యాంపెయిన్‌కు పిలుపునిచ్చారు. ఆయన పిలుపు మేరకు ఆళ్లపల్లి అనంతోగు నుండి కాచినపల్లి మార్గంలో ప్రమాదకరమైన కొన్ని గుంతలను పూడ్చారు. అదే విధంగా మణుగూరు బిఆర్ఎస్ భవన్‌పై జరిగిన దాడికి నిరసనగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, యూత్ పూసం నాగేష్, రఘుపతి, మొక్కటి రామ్, చరణ్, కుంజ రవితేజ, గొగ్గేల సాత్విక్, కోరం రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## టియుసిఐ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కారేపల్లి:** ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లా రాజకీయ తరగతులు నవంబర్ 9వ తేదీన నేలకొండపల్లి మండల కేంద్రంలో ఎన్నుకోవడిన ప్రతినిధులతో నిర్వహించడం జరుగుతుందని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా కారేపల్లి కామేపల్లి ఏరియా కార్యదర్శి ధరావత్ సక్రు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మదారంలో జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు కార్మిక వర్గ కర్తవ్యాలు అంశాన్ని టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కె సూర్యం, భారత కార్మికోద్యమ చరిత్ర అంశాన్ని, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎల్ పద్మ టియుసిఐ నిర్మాణం పని విధానం అంశాన్ని జిల్లా కార్యదర్శి జి రామయ్య బోధిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో టియుసిఐ నాయకులు బాదావత్ వీరు, లక్ష్మణ్, శివ, సంతు, నాగేశ్వరరావు, సుమన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ పట్ల ప్రజలు అవగాహన, అప్రమత్తతతో ఉండాలి

**-అసంక్రమిత వ్యాధుల జిల్లా నివారణ అధికారి డాక్టర్ డి రామారావు**
**-నేడు జాతీయ క్యాన్సర్ నివారణ అవగాహన దినం**





**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం :** జాతీయ క్యాన్సర్ నివారణ అవగాహన దినం సందర్భంగా జిల్లా నివారణ అధకారి డాక్టర్ డి రామారావు ప్రజలకు క్యాన్సర్ నివారణకు అవసరమైన జాగ్రత్తలు, క్యాన్సర్ నివారణ పట్ల అవగాహన కల్పించారు. దైనందిన జీవితంలో క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన చాలా అవసరమని అన్నారు. క్యాన్సర్ వ్యాధి కాదు అని, ఇది కేవలం జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పర్యావరణ ప్రభావాలు, వంశపారంపర్య కారణాల వలన క్రమంగా ఏర్పడే ప్రమాదకర వ్యాధి అని తెలిపారు. ధూమపానం, మద్యపానం, పోగాకు నమలడం వంటి అలవాట్లను పూర్తి మానేయాలని తెలిపారు. తీసుకునే ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, గింజలు, పీచు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడం ద్వారా శరీర రక్షణశక్తి పెరుగుతుందన్నారు. బేకరీ పదార్థాలు, బయట రోడ్ల మీద అమ్మే తిను పదార్థాలను పూర్తిగా తగ్గించాలని, రోజువారీ శారీరక శ్రమ, యోగ, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ ద్వారా ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. రోజువారీ జీవితంలో ఏమైనా తాగాలన్నా, తినాలన్నా, పేపర్ కప్స్, పేపర్ ప్లేట్స్ వాడదంలో ఉన్న విషపదార్థాల ద్వారా క్యాన్సర్ల బారిన పడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా మహిళల సంపూర్ణ ఆరోగ్యాన్ని లక్ష్యంగా చేసుకొని మహిళలు ఎదుర్కోనే 8 ప్రధాన ఆరోగ్య సమస్యలపై దృష్టి సారిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య సేవలను, మందులు ఉచితంగా అందిస్తున్నారన్నారు. ప్రతి మంగళవారం మహిళలకు ఈ ప్రత్యేక వైద్య సేవలను, మందులను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరికీ ఆరోగ్య సంరక్షణ అందుబాటులోకి తేవడం, మహిళలు ప్రధానంగా ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపడం, ప్రతి మహిళా ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉండాలని కోరుకోవడం, మహిళలు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి 57 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి కార్పోరేట్ ఆసుపత్రులలో లభించే అనేక చికిత్సలు ఇక్కడ అందిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడానికి, నిర్ధారించడానికి, వ్యాధి వ్యాప్తిని తెలుసుకోవడానికి, చికిత్సకు ముందు దాని స్థాయిని అంచనా వేయడానికి, చికిత్స ఎంతవరకు పనచేస్తుందో పర్యవేక్షించడానికి శారీరక పరీక్షలు, రక్త పరీక్షలు, ఇమేజింగ్ పరీక్షలు, బయాప్సీ, ఎండోస్కోపీ, జన్యు పరీక్షలు, కాన్సర్ సాధరణ స్కీనింగ్ పరీక్షలు, రొమ్ము క్యాన్సర్ మమ్మోగ్రఫీ, గర్భాశయ క్యాన్సర్ పాప్ స్మియర్ పరీక్ష, పెద్దప్రేగు క్యాన్సర్ పెద్దప్రేగు దర్శిని ద్వారా గుర్తించి చికిత్సలు అందిస్తారు. క్యాన్సర్‌ను ఎంత ముందుగా గుర్తిస్తే ,చికిత్స చేయడం సులభం, నయం అయ్యే అవకాశాలు ఎక్కువ. కావున ప్రజలు క్యాన్సర్ వ్యాధిపట్ల అవగాహనతో ఉండాలని అసంక్రమిత వ్యాధుల జిల్లా నివారణ అధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు.

# పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండలో పత్తి కొనుగోలు కేంద్రం (సిసిఐ) ఏర్పాటు చేయాలని చంద్రుగొండ తెలుగుదేశం పార్టీ మండల కమిటీ అధ్యక్షులు వారాధి సత్యనా రాయణ, ప్రధాన కార్యదర్శి చాపల మడుగు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం వారు చంద్రుగొండ తహసీల్దార్‌కి పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సిసిఐ కేంద్రం నడిచిందని, తిరిగి ప్రారంభిచగలరని కోరారు. మార్కెట్ యార్డ్‌లో జామాయిల్ మొక్కలు, ఇతర మొక్కలు తొలగించారు కానీ అవి మళ్లీ ఇగురు వచ్చిందని, పూర్తి స్థాయిలో తీసివేసి మార్కెట్ యార్డ్‌ని శుభ్రపరచి మార్కెట్ యార్డ్‌లాగా దాని తయారు చేయాలని కోరారు. మార్కెట్ యార్డ్‌లో పత్తి కొనుగోలు కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రము వెంటనే ఏర్పాటు చేయాలని విన్నవించారు. పత్తి క్వింటా ధర పదివేల రూపాయలు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. వరి ధాన్యం ఏ గ్రేడ్ 3900రూపాయలు, బి గ్రేడ్ 3700 మద్దతు ధర ఇవ్వాలని, రైతులు అందరం కలిసి డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులో వేబ్రిడ్జి లేదని నిర్మించుకున్నారు. చంద్రుగొండ మండలంలో సాదాబైనామ, వారసత్వ భూములకు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ భూములకు పట్టా హక్కులు కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి పేర్కొన్నారని, వారి హామీని తక్షణమే అమలు చేయాలని, ఎస్సీ, బీసీ, ఓసీ ముస్లిం రైతులకు భూమిపై హక్కు కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వామిత్ర యాజమాన్యం హక్కు పత్రం కల్పించాలన్నారు. సీతయ్యగూడెం ప్రాజెక్ట్ అలుగు నిర్మాణాన్ని బ్రిడ్జిని కాలువలను వెంటనే పునర్దించాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు బి పరమేశ్వరరావు, కిలారు ప్రసాదు, చిరుమామిళ్ల కిరణ్, సిహెచ్ కిరణ్, బి విజయలక్ష్మీ, కొదుమూరి సత్యనారాయణ, లాలు మోహన్‌రావు, శేఖర్, మోహన్‌రావు, బేటీ సోమయ్య, పి వేణు, పి వెంకటి, వెంకటాచారి, తన్నీరు లక్ష్మీ నారాయణ, నెక్కడుపు రామారావు, కే రాములు, రాంబాబు, కే సాగర్, డి మల్లేష్, ఈ కిషన్, సిద్ధిని సీతారాములు, పి నాగరాజు, ఏ సత్యం, రాచర్ల వెంకటేశ్వర్లు, జి బాలు, కె కోటేశ్వరరావు, సున్నం శోభన్నమ్మ, మొఖం రాధా, కౌసల్య, వరి, పత్తి రైతులు, నందమూరి హమాలి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేద్దాం




**ప్రజాపక్షం/కారేపల్లి:** అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రజా యుద్ధ పందా మార్గంలో కొనసాగుదామని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర రాష్ట్ర నాయకులు ఆవునూరి మదన్న, గౌని ఐలన్నలు పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల నవంబర్ 1 నుండి 9 వరకు అమరవీరుల సంతాప సభల పిలుపులో భాగంగా 6 నవంబర్ 2025న రాత్రి ఏడు గంటలకు కారేపల్లి మండలం మాదారం గ్రామంలో అమరులైన కామ్రేడ్ షేక్ బిక్కుమీయా తుమ్మలపల్లి హనుమంతరావులా సంతాప సభ మండల నాయకులు కుర్ర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముందుగా గ్రామంలో ప్రదర్శన నిర్వహించి పార్టీ సీనియర్ నాయకులు నాగయ్య పార్టీ స్తూపంపై జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో వారు పాల్గొని మాట్లాడుతూ భారత విప్లవోద్యమ చరిత్రలో భూమి కోసం భుక్తి కోసం అసమానతలు లేని దోపిడి పీడనలు లేని సమ సమాజ స్థాపన కోసం ఈ దేశ విముక్తి కోసం సాయుధ పోరాటమే ఏకైక మార్గమని అన్నారు. దాదాపు 15వందల మంది వీరులను అమాయక ఆదివాసులను ఎన్‌కౌంటర్ పేరుతో హత్యకాండ చేసిందని, మానవ హక్కులను విస్మరించి తీవ్ర రాక్షస నిర్బంధాన్ని కొనసాగిస్తుందని మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, దీనికి వ్యతిరేకంగా రైతులు రైతులు కూలీలు కార్మికులు ప్రజాస్వామికవాదులు పోరాటాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వై ప్రకాష్, కోయిల శ్రీనివాస్, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, వై జానకి, వీరుగడ్డ వెంకన్న, కావేటి నాగేశ్వరరావు, నరేష్, సురేష్, సతీష్, ఎర్రయ్య, శివయ్య, గురవయ్య, గోవిందు, అంజి, అలం చంద్రయ్య, బైరుమల్ల లక్ష్మయ్య, తావూరియా నాగయ్య, నరసింహారావు, విష్ణు నారాయణ, జితేందర్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# బాలికలపై ఆగని వేధింపులు, హత్యాచారాలు..!

**-విద్యార్థినులకు పాఠశాలలో భరోసా శూన్యం**
**-సర్కారు పాఠశాలలో కనిపించని నిఘా నేత్రాలు**
**-ఏది గుడ్ టచ్, ఏది బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం**
**-గతంలో పలుచోట్ల చెప్పుకోలేని సంఘటనలు**
**-మానత్వాన్ని మరిచిపోతున్న మానవ మృగాలు**



**ప్రజాపక్షం/వైరా:** విద్యాబుద్దులు నేర్పాల్సిన ఉపాధ్యాయులతో పాటు పలు పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది వికృత చేష్టలతో బాలికలు పాఠశాలకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితిలు ప్రస్తుతం సమాజంలో కనిపిస్తున్నాయి. ఇటీవల ఖమ్మం జిల్లాలో పలు పాఠశాలలో బాలికలతో, కొన్నిచోట్ల బాలురతో అసభ్యంగా వ్యవహరిస్తున్న తీరు చూస్తే మానవ మృగాల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనేది అర్థమవుతుంది. విద్యాబుద్దులు నేర్చుకొని ఉన్నతస్థాయిలో ఉండాలని అనుకున్న విద్యార్థులు, విద్యార్థినిలకు ప్రస్తుతం పాఠశాలల్లో, బయట కూడా రక్షణ లేదని చెప్పవచ్చును. ఆడ మగ అనే తాడేఆ లేకుండా మానవ మృగాలు అతినీచంగా ప్రవర్తిస్తున్న తీరును చూస్తే ప్రతిఒక్కరూ కోపంతో ఆగ్రహంతో రెచ్చిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కొణిజర్ల మండలం తనికెల్ల సమీపంలోని గురుకుల పాఠశాలలో బాలుడి పట్ల ఉపాధ్యాయుడు ప్రవర్తించిన తీరు చూస్తే వీడు మనిషేనా అనే వాదన ప్రతిఒక్కరిలో ఏర్పడింది. పాఠశాలకు పంపించిన విద్యార్థినిలకు కొన్నిచోట్ల ఉపాధ్యాయుల పట్ల వేదింపులు అత్యాచారాలు తప్పడం లేదు. మరికొన్ని చోట్ల మానవత్వాన్ని మంటగొలిపే విధంగా బాలురుపై కూడా ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తిస్తున్న తీరు చూస్తే సర్వ సమాజం ముక్కుపై వేలేసుకోవాల్సిన పరిస్థితి కూడా ఏర్పడింది. ఇలాంటి మానవ మృగాలు సమాజానికి అవసరమా అని ఇంటికి వచ్చిన బాలికలకు కూడా రక్షణ లేదనే చెప్పవచ్చును. గత రెండు రోజుల క్రితం వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులో ఓ బాలికపై ముగ్గురు వ్యక్తులు హత్యాచారానికి పాల్పడిన సంఘటన కూడా ఇప్పుడు కలవరపెడుతూ ఉంది. ఏది మంచి ఏది చెడు అని తెలుసుకోలేని చిన్నారులను సైతం మానవ మృగాలు వెంటాడుతున్నాయి. రాష్ట్రంలో చూసుకుంటే పలు ప్రాంతాల్లోనే పాఠశాలల్లో బాలికలపై అత్యాచారాలు వేధింపులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల కాలంలో ఎక్కువగా విద్యార్థినిల పట్ల అసభ్య ప్రవర్తనలో కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల మరుగుదొడ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం తర్వాత వారిని ఇబ్బందులు గురిచేయడం సంఘటనలు లేకపోలేదు. ఇలాంటి సంఘటన వలన మహిళా ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు పట్ల పరిస్థితులు ఉన్నాయి. దీంతో బాలికలకు భద్రత లేదని భావన ప్రజల్లో కూడా వ్యక్తమవుతూ ఉంది. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేస్తున్న వికృత చేష్టలు విద్యార్థినిలు తల్లిదండ్రులకు చెప్పుక్లోని పరిస్థితి కూడా ఏర్పడింది. దీంతో మానసిక ఒత్తిడికి గురవుతూ జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు పాఠశాలలతో పోల్చుకుంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే రక్షణ కరువైందని వాదన అధికంగా వినిపిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో కనీసం సిసి కెమెరాలు ఏర్పాటు కూడా ఎక్కడ కనిపించడం లేదు. ఎందుకు అంటే సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తే పాఠశాలల్లో ఎవరు ఏం చేస్తారు చేసినా వెంటనే అర్థమయిపోతాయి. కోట్ల రూపాయలు పాఠశాల భవనాలకు అభివృద్ధికి వెచ్చిస్తున్నారు తప్ప ఏ పాఠశాలలోను సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం లేదు. అలా సిసి కెమెరాలు ఏర్పాటు చేయకపోవడమే పలు చోట్ల అనర్థాలకు కారణమని చెప్పవచ్చు. అదే సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ఉంటే ఏ ఒక్క ఉపాధ్యాయుడు కూడా విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడు. ప్రభుత్వ పాఠశాలలో ముఖ్యంగా సిసి కెమెరాలు ప్రాముఖ్యత చాలా అవసరమని పలువురు ఆర్పోస్తున్నారు. పలువురు తల్లిలండ్రులు కూడా పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు దేహశుద్ధి చేసిన సందర్భాలు లేకపోలేదు. ఇలాంటి తరుణంలో ప్రతి పాఠశాలలో బాలిక సాధికారిత కబుర్లు చెప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రతి పాఠశాలలో షీటీమ్‌ల ద్వారా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇలా షీటీమ్‌లతో సదస్సులు ఏర్పాటు చేయడం ద్వారా ఎన్నో మంచి మార్పులు వస్తాయి. పాఠశాలల్లో ప్రభుత్వ ఉపాధ్యాయునిలకు కూడా కొన్నిచోట్ల వేధింపులు తప్పడం లేదు. మహిళా ఉపాధ్యాయులు చెప్పుకోలేకుండా కుంగిపోతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. చెప్పుకుంటే ఏమవుతుందో ఇటు ఉద్యోగరీత్యా అటు కుటుంబ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన అవసరం వస్తుందని వారిలో వాళ్లే కుమిలిపోతూ ఇబ్బందులు గురవుతున్న సందర్భాలు కలూడా లేకపోలేదు. ప్రతి పాఠశాలలో విద్యార్థినిలకు ఏది గుడ్ టచ్ ఏది బాడ్ టచ్ అనేది చెప్పాల్సిన ఆవశ్యకత చాలా అవసరం. ఎందుకంటే తల్లిదండ్రులు కూడా పిల్లలకు ఏది మంచి ఏది చెడు ఎవరు ఎక్కడ ఏ విధంగా తాకకూడదు అనే విషయాన్ని ఇటు తల్లిదండ్రులు అటు ఉపాధ్యాయులు బాలికలకు చెప్పడం ఇప్పుడు చాలా అవసరం. అదేవిధంగా బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న పలువురు ఉపాధ్యాయులు కావచ్చు. ఆకతాయిలు కావచ్చు వయసు మళ్లిన వారు కావచ్చు. ఎవరైనా సరే బాలికల వైపు కాని మహిళల వైపు కాని చెడు ప్రవర్తనతో చూస్తే వాడికి ఉగ్రరూపం ఏ విధంగా ఉంటుందో చూపించే విధంగా విద్యార్థి నీళ్లలో మహిళల్లో ముఖ్యంగా ధైర్యం నింపాలి. అప్పుడే మానవ మృగాలకు సమరగీతం పాడవచ్చు. దీనికి ప్రతిఒక్కరూ మద్దతుగా నిలబడి సమాజంలో జరుగుతున్న మహిళల పట్ల వేధింపులకు విద్యార్థినిల పట్ల అత్యాచారాలకు ముగింపు పలికే విధంగా మరొకడు అటువైపు చూడకుండా ఉండేవిధంగా బుద్ధి చెప్పాల్సిన ఆవశ్యకత ఇప్పుడు చాలా అవసరం.

# పచ్చని చెట్లపై గొడ్డలి వేటు..!

**హరితహారంపై నిర్లక్ష్యపు నీడలు**





**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలం గ్రామ పంచాయితీ మండల పరిధిలో ఉన్నటువంటి వెంకటాపురం బుగ్గపాడు ఫుడ్ కోర్ట్ వైపుకు వెళ్లే రహదారికి ఇరువైపులా నాటి ప్రభుత్వం 2021వ సంవత్సరంలో చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో నాటడం జరిగింది. అబ్బుగూడెం రాజాపురం గ్రామాల మధ్యలో రహదారికి ఇరువైపులా ఆహ్లాదకరంగా మొక్కలను పెంచారు. ఈ మొక్కలు నాటడానికి సుమారు 5లక్షల రూపాయల నుండి పది లక్షల వరకు వ్యయంను కేటాయించారు. ఏది ఏమైనప్పటికీ గతంలో ఉన్నటువంటి ఎంపీడీవో, ఏపీవో, ప్రత్యేక అధికారుల సంరక్షణలో ఈ మొక్కలను సంరక్షిస్తూ సాలు మరదగా ఒక క్రమ పద్ధతిలో రోడ్డుకి ఇరువైపులా పచ్చదనాన్ని పంచే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణ ఏర్పాటు చేయడంలో కృషి చేశారు. వేసవి కాల సమయంలో బాటసారులకు ప్రయాణికులకు పశుపక్షాదులకు చల్లటి నీడనిస్తూ సేద తీరుస్తున్నాయి. పర్యావరణ ప్రేమికులకు ఆహ్లాదకరమైన వాతావరణము అందిస్తున్నాయి. ప్రస్తుతం కొద్ది నెలల క్రితం ఉన్నట్టుండి కొన్ని చెట్లు గొడ్డలి వేటకు బలి అయిపోయాయి. దీనికి కారకులు ఎవరు...ఎందుకు తీయవలసి వచ్చింది. అసలు ఈ చెట్లను తొలగించాల్సిన అవసరం ఎవరికి...కలప వ్యాపారం చేసే వ్యారాస్తులకా..మరెందుకు ఈ చెట్లు గొడ్డలి వేటుకు బలి అయిపోయాయి కనీసం ఆనవాళ్లు కూడా లేకుండా చేశారు. ఇంత జరుగుతున్నా అధికారుల దృష్టి మాత్రం ఈ చెట్ల వరసపై లేకుండా పోయింది. చెట్లను పెంచడమే కాదు సంరక్షించే దిశగా కూడా అధికారులు పని చేయాలని, గొడ్డలి వేటుకు బలి అయినచెట్లు ఉన్న అదే ప్రాంతంలో మరల చెట్లను పెంచాలని ఇప్పటికైనా స్పందించి ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై అధికారులు విచారణ జరిపించి తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

# విప్లవోద్యమంతా త్యాగాల అడుగుజాడలే..



**ప్రజాపక్షం/ములకలపల్లి:** కమ్యూనిస్టు ఉద్యమం విప్లవోద్యమం అంతా త్యాగాలా అడుగుజాడలేనని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నుపా భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏనుగప్పయ్య నగర్ గ్రామంలో జరిగిన అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ సంయుక్త మండల కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ పార్టీ మండల కార్యదర్శి కోర్సా రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రత్యేకించి 58 ఏళ్ల భారత కమ్యూనిస్టు విప్లవ ఉద్యమాలలో ప్రజల కోసం, ఈ దేశంలో ప్రజాతంత్ర, సోషలిస్ట్ విప్లవం కోసం పోరాడి ఎందరో ప్రాణాలర్పించారు. భారతదేశంలో వర్గ పీడన, దోపిడీ, కుల వ్యవస్థ మతాలు, మూఢనమ్మకాలు, అసాంఘిక, రాజకీయ అసమానతలు, ఆర్థిక అంతరాలు పోవాలని, మనిషిని మనిషి పీడించే సమాజం అంతరించి నిండైన, మైండైన ప్రజాస్వామిక సమాజం రావాలని, సోషలిస్ట్ సమాజం స్థాపించాలనే ఆశయాన్ని వారెంచుకున్నారని తెలిపారు. ఆ ఆశయం వెలుగులో వారు యావత్ జీవితాన్ని సమాజ మార్పు కోసం వెచ్చించారని, ప్రజలను కూడగట్టి ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. ప్రజలలో సామాజిక విప్లవ చైతన్యం రగించారని, సమరశీలతను సమాజానికి అందించారని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు వెలకం చలమన్న, కారం వెంకటేష్, శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు, పిఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు నుపా సరోజిని, నాయకులు ఊకే అజయ్, ఓకే నారాయణ, మడకం కోశయ్య, మడివి విజయ్, మడకం దేవా, తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతర గీతానికి గౌరవ వందనం





**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో మహాలక్ష్మీ ఆధ్వర్యంలో స్వతంత్ర ఉద్యమ గీతం వందేమాతరానికి 150 ఏళ్లు నిండిన సందర్భంగా కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి గౌరవ వందన సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 1875వ సంవత్సరంలో బకింగ్ చంద్ర చటర్జీ గేయాన్ని రచించడం జరిగిందనీ, ఈ గేయం వింటే అప్పటి బ్రిటిష్ పాలకుల గుండెల్లో ఎంతో భయంతో వనికి పోయే వారని, భారతీయుల యుద్ధ ఆయుధంగా గౌరవ గేయంగా ఉద్యమ గీతంగా వెలసిల్లుతూ ఎంతో మంది దేశ నాయకుల అమరుల త్యాగాల ఫలితంగా 150 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు గాను, ఇది భారతీయులు ఎంతగానో గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈసందర్భంగా పురస్కరించుకుని కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఎస్‌కె బురాన్ వందేమాతర గేయం యొక్క ప్రాముఖ్యతను, దేశ నాయకుల త్యాగాలను విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఎంపీఓ షబానా, ఏపీఓ ప్రమీల, ఈసీ వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది, కళాశాల ఎటిపి శ్రీకాంత్,డిప్యూటీ వార్డెన్‌మధు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/గుండాల :** మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ పరపతిసంఘం శాఖ(పిఏసిఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కజొన్నలను ప్రభుత్వకనీస మద్దతుధర క్వింటాకు 2400రు. కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దారు ఖాసీం ప్రారంబింప చేశారు. సందర్భంగా సిఏసిఎస్ చైర్మెన్ గొగ్గెల రామయ్య మాట్లాడుతూ ఇట్టి అవకాశాన్నిఇ మండల రైతులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ప్రైవేటి దళారి వ్యాపారులకు పంటను అమ్మి నష్ట పోవద్దని రైతులకు తెలియ చేశారు. రైతులు జొన్నలను ఆరపెట్టి కనీసం మైచర్ 14 శాతం ఉండేల చూసుకోవాని సూచించారు. రైతులు పంటను కొనుగోలు కేంద్రానికి తెచ్చేటప్పుడు రైతు పట్టాపాస్‌బుక్, ఆధార్‌కార్డ్ జిరాక్స్, బ్యాంక్ ఎకౌంట్ జిరాక్స్, ఏఒ,ఏఇఒలు ఇచ్చే సర్టిఫికెట్ విదిగా వెంట తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సిఐ ఎల్ రవిందర్, ఎంపిడిఒ బాలరాజు, పంచాయితి సెక్రెటరి రెడ్డి,ఏఇఒ బాలరాజు సిఇఒ పాష, , పిఏసిఎస్ సిబ్బంది రాంబాబు, కాంతారావు , ఎస్కె సాబీర్, మాజీఎంపిపి సత్యం, బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మోకాళ్ల నొప్పులకు రోబోటిక్ సర్జరీ




-యశోద ఆసుపత్రి వైద్యులు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : సరికొత్త విధానంలో మోకాళ్ల నొప్పులను నివారించేందుకు రోబోటిక్ సర్జరీ ద్వారానే సాధ్యమని హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యులు సునీల్ దాచేపల్లి తెలిపారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సునీల్ దాచేపల్లి మాట్లాడుతూ మోకాళ్ల మార్పిడి అనేది ఇప్పుడు సర్వ సాధారణమైందన్నారు. ఫిజియోథెరపి చేపిస్తే బాగా నొప్పులు, బెడ్‌రెస్ట్ తీసుకోవాలని, నెలల తరబడి చికిత్స తీసుకున్న కూడా ఫెయిలయ్యే అవకాశాలు ఉంటాయని ప్రజల్లో అపోహలు, భయాలు ఉన్నాయన్నారు. ఇప్పుడు మోకాళ్ల మార్పిడి అనేది విజయవంతమైన శస్త్ర చికిత్స అన్నారు. మోకాళ్ల నొప్పులకు ట్రీట్‌మెంట్ తీసుకున్న తర్వాత నొప్పి నుంచి రిలీఫ్ కావడంతో పాటు నార్మల్ లైఫ్ లాగానే తమ పనులు తాము చేసుకుంటారన్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా లక్షల్లో మోకాళ్ల నొప్పుల ఆపరేషన్లు జరుగుతున్నాయన్నారు. మోకాళ్ల మార్పిడి చేసుకోవడం ద్వారా చాలా లాభాలు ఉన్నాయన్నారు. నొప్పులు తగ్గిపోయి రిలీఫ్‌గా ఉంటారని, అనవసరంగా నొప్పుల మందులు వాడకుండా కిడ్నీలను కాపాడుకోవచ్చునన్నారు. ఇప్పుడు మోకాళ్ల మార్పిడిలో రోబోటిక్ సర్జరీ కూడా వచ్చిందని ఇది ప్రస్తుతం చేసే మోకాళ్ల మార్పిడి కంటే ఆధునిక పద్ధతి అన్నారు. రోబోటిక్ సర్జరీ విధానంలో మోకాళ్ల మార్పిడి వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. గాయం కూడా చిన్నగా ఉంటుందని, నొప్పి తక్కువగా ఉంటుందని తెలిపారు. సర్జరీ చేసిన నాలుగు గంటల నుండే నడవవచ్చునని తెలిపారు. ఆసుపత్రి నుంచి మూడు రోజుల్లోనే డిశ్చార్జ్ కావచ్చునని, ఫిజియోథెరపి చేసేటప్పుడు నొప్పులు తక్కువగా ఉంటాయన్నారు.

# సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

ప్రజాపక్షం/బోనకల్ : సీనియర్ ఉపాధ్యాయులు టెట్ మినహాయింపు ఇవ్వాలని, ప్రధానోపాధ్యాయుల సమావేశాలు జిల్లా కేంద్రంలో నిర్వహించటం తగ్గించాలని ఎస్‌యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ అన్నారు. శుక్రవారం బోనకల్ మండల కేంద్రంలో మూడు కాంప్లెక్స్ కమిటీల ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరిగా చేస్తూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అసంబద్ధంగా ఉందని, వెంటనే సమీక్షించాలని డిమాండ్ చేశారు. దీని ద్వారా దేశ వ్యాప్తంగా 22లక్షల టీచర్లు తెలంగాణ రాష్ట్రంలో 32వేల మంది టీచర్లు ఇబ్బందులకు గురవుతున్నారని, అందువలన కేంద్ర విద్యాశాఖ స్పందించి వెంటనే విద్యాహక్కు చట్టంలోని 23వ క్లాసును మార్చి విద్యాహక్కు చట్టం అమలైన తేదీ నుంచి టెట్ వర్తించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. అనంతరం కాంప్లెక్స్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోగా బోనకల్ కాంపెక్స్ కన్వీనర్‌గా రేఖం శ్రీను, కో కన్వీనర్‌గా పద్మావతి, జానకీపురం కాంప్లెక్స్ కన్వీనర్‌గా జి.శ్రీనివాసరావు, కో కన్వీనర్‌గా గంగుల పావని, కలకోట




కాంప్లెక్స్ కన్వీనర్‌గా ఎం.లవకుశ, కో కన్వీనర్‌గా నసీమా సుల్తానను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిన్న రంగారావు, జిల్లా నాయకులు సద్దా బాబు, మండల ఉపాధ్యక్షులు పి.గోపాలరావు, మండల కార్యదర్శులు పి.నర్సింహారావు, బి.నిర్మల, చిట్యాల కోటేశ్వరరావు, యోహాన్, శ్రీనివాసరావు, భాషా బ్రహ్మం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మారిన జీవన శైలి వివిధ రకాల ఆహారపు అలవాట్ల వలన పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రస్తుతం అనేక రకాల క్యాన్సర్ల బారిన పడుతున్నారని, క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సం సందర్భంగా శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ శరీరంలోని నోరు, గొంతు, రొమ్ము, జీర్ణాశయం, కాలేయం వంటి ఏ భాగానికైనా రావచ్చని, పొగాకు, శ్రమ లేకపోవడం, వారసత్వం వల్ల కూడా వచ్చే అవకాశం ఉంటుందని, ఈ వ్యాధిని తొలిదశలో గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా మరణాలను తగ్గించవచ్చునని తెలిపారు. మంచి ఆహార అలవాట్లు సరైన జీవన శైలితో క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని, ప్రజలందరూ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పిహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, లతాశ్రీ, స్టాఫ్ నర్సులు నూర్జహాన్, సుజాత, జ్యోతి, ఫార్మసిస్ట్ అమృత్, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# నల్ల రిబ్బన్లతో మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

ప్రజాపక్షం/కల్లూరు: మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం నుంచి నల్లరిబ్బన్లతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న 60 పాఠశాలలో 152 ఏజెన్సీలు గత 20 సంవత్సరాలుగా పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్నారు కానీ 2024 డిసెంబర్ నుంచి బిల్లులు వేతనాలు కోడిగుడ్డు బిల్లులు అందక 10 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కనుక శుక్రవారం నుంచి బిల్లు బకాయిలు నూతన బకాయిలు వచ్చే వరకు నల్ల రిబ్బన్లతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఉపాధ్యక్షులు వేము రాంబాబు తెలిపారు. భోజనాలు నిర్వాహకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ఏజెన్సీని నిర్వహిస్తూ విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నామని ఈ విధంగా బిల్లులు ఆలస్యం కావడంతో అప్పులు పాలై మధ్యాహ్న భోజనం అందించక నానా కష్టాలు పడుతున్నామని వారు తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం



10,000 వేతనం ఇవ్వాలని, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలను అందించాలని కోడిగుడ్డు బిల్లులు అల్పాహారం బిల్లులు తక్షణమే అందించాలని రోజువారి నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దామాల దయాకర్ రావు, మధ్యాహ్న భోజనం జిల్లా నాయకులు పాగా సత్యవతి , కంభంపాటి వెంకటలక్ష్మి ,కళావతి అప్పమ్మ ,కృష్ణ కుమారి, బండి ఊహలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం గీతాలాపన



ప్రజాపక్షం/ మధిర : గొప్ప విశిష్టత కలిగిన వందేమాతరం జాతీయ గీతం నవంబర్ 7న 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో వందేమాతరం గీతం సామూహిక గానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తమ జిల్లాల్లోని కలెక్టర్ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో సామూహిక గానం కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు ఆదేశించారు. కార్యక్రమం వివరాలు, ఫొటోలు, నివేదికలు సాయంత్రంలోపు ప్రభుత్వానికి పంపించాల్సిందిగా సూచించారు. దీనిలో భాగంగా మధిర తహశీల్దార్ కార్యాలయం, మున్సిపాల్టీ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయం,మధిర రూరల్ సర్కిల్ కార్యాలయంలో తదితర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉదయం 10గంటల వందేమాతరం సామూహిక గీతాలపాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాంబాబు, మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్, సిబిడి మధు ఆయా కార్యాలయాలు అధికారులు, ఇతర సిబ్బంది, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌బాల్ పోటీల్లో ఖమ్మం జట్టుకు మూడో స్థానం



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : తెలంగాణ రాష్ట్ర అండర్ 14 బాలుర ఫుట్‌బాల్ టోర్నమెంటులో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు మూడవ స్థానం సాధించింది. వికారాబాద్‌లో నవంబర్ మూడు నుంచి ఐదు వరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అండర్ 14 బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో ఖమ్మం జిల్లా జట్టు అద్భుత ప్రదర్శనతో మూడవ స్థానం సాధించింది. ఆ జట్టులో వి. వెంకటాయపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.లక్ష్మీనాగచరణ్, బి. జస్విర్ లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. ఇదే పాఠశాల నుంచి చెన్నకేశవ, సాయిచరణ్, సుభాష్, సాత్విక్, హర్షశ్రీ, శృతి, జయశ్రీ, యమున, జశ్విత, హరిక, మనీషా, అంజలి, మాధవి తదితరులు అండర్ 14 బాలికలు, అండర్ 17 బాలురు, బాలికలు, అండర్ 19 బాలుర విభాగాలలో తెలంగాణ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనడానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

# షైన్ స్కూల్‌లో వందేమాతరం గీతాలాపన



ప్రజాపక్షం/ బోనకల్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం షైన్ స్కూల్‌లో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ అన్వర్ పాషా మాట్లాడుతూ వందేమాతరం గీతం గొప్పతనాన్ని, విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ప్రభుత్వం వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ శ్వేత, అడ్మినిస్ట్రేషన్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# సామినేని కుటుంబానికి సిపిఐ పరామర్శ



ప్రజాపక్షం/చింతకాని : ఇటీవల హత్యగావించబడిన సిపిఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావు కుటుంబాన్ని సిపిఐ నేతలు శుక్రవారం పరామర్శించారు. రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ రామారావు హత్యకేసులో నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని , పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేయాలన్నారు. పరామర్శించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, మండల నాయకులు తాళ్ళూరి యాదగిరి, కొత్తపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు కొనుగోలు కేంద్రాల్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/చింతకాని : రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధర పొందాలని మత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు కోరారు.శుక్రవారం చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో ఐకెపి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఛైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కనీస మద్దతు ధర క్వింటాకు ఏ గ్రేడ్ సన్నరకానికి 2389 , కామన్ గ్రేడ్ రకానికి2369 రూపాయలు చెల్లిస్తారన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బండెల నాగార్జున, ఆత్మ కమిటీ డైరెక్టర్ కొప్పుల గోవిందరావు, తహసీల్దార్ బాబ్జిప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు కూరపాటి కిషోర్, కిలారి మనోహర్‌బాబు, భాస్కర్, గోపి, పెంట్యాల అప్పారావు, ఐకెపి ఏపీఎం నాగపుల్లారావు, సీసీలు నరేందర్‌రెడ్డి, సెంటర్ ఇంచార్జ్ నాగమణి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తిరపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పరిమితికి మించిన ప్రయాణికుల వల్లే ప్రమాదాలు

**-ఆర్ఎంకు అద్దె బస్సుల యజమానుల వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బస్సులలో పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అద్దె బస్సు యజమానులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఖమ్మం ఆర్టీసి రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడం వల్ల పరిమితికి మించి బస్సులలో ప్రయాణిస్తున్నారని దీని వల్ల మైలేజీ రాకపోగా డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని అధిక బరువుతో టైర్లు పగిలిపోతున్నాయని యజమానులు తెలిపారు. నష్టాలను, కష్టాలను భరించి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నామని దీనికి తోడు రోడ్లు సరిగ్గా లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతుందని తెలిపారు. పరిమితికి మించిన ప్రయాణికులు ఉండడం వల్ల బీమా సంస్థలు కూడా పరిహారం ఇవ్వడం లేదని వినతి పత్రంలో ప్రైవేటు బస్సు యజమానులు పేర్కొన్నారు.పలుమార్లు ఈ విషయమై ఆర్టీసి యాజమాన్యం దృష్టికి తీసుకు వచ్చిన ఫలితం లేకపోయిందని వారు తెలిపారు. పరిమితికి మించకుండా ప్రయాణికులను ఎక్కించే పద్ధతిని అమలు చేయాలని లేని పక్షంలో ఈనెల 24 నుండి ఆర్టీసి అద్దె బస్సులను ఇక నడపలేమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైర్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నకిరికంటి సత్యంబాబు, కార్యదర్శి పైడిపల్లి రవికుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు సూరంపల్లి నరేందర్, నల్లమోతు రమేష్, పి. సుబ్బారావు, వనమా శ్రీనివాసరావు, ఏవిరావు, కొండబాబు, శ్రీనివాస ప్రసాద్, నామ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజు ఉత్సాహంగా జోనల్ స్పోర్ట్స్ మీట్

**హోరాహోరీగా పోటీపడ్డ క్రీడాకారులు**



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రెండో రోజు జోనల్ మీట్ క్రీడలు అత్యంత ఉత్సాహభరితంగా జరిగాయి. అండర్14 విభాగంలో 200 మీటర్స్ పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా ఎస్.భార్గవి(వైరా), ఏ.ఏంజెల్(టేకులపల్లి), పి.స్రవంతి(కల్లూరు) సాధించారు. 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా ఎస్.భార్గవి వైరా పి.స్రవంతి(కల్లూరు), జె.కావ్యశ్రీ(వైరా), 600 మీటర్స్ పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా పి.స్రవంతి(కల్లూరు), సిహెచ్.మహాలక్ష్మి(ఇల్లందు), ఏ.లక్ష్మీ త్రివేణి(వైరా) సాధించారు. షాట్‌పుట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా డి.భవ్యశ్రీ(అడవిమల్లెల), ఎస్.భార్గవి(వైరా), వి.మేఘవర్షిత(కూసుమంచి) సాధించారు. లాంగ్ జంప్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా ఏ.లక్ష్మీ త్రివేణి(వైరా), ఎస్.భార్గవి(వైరా), కె.నవ్య(ఇల్లందు)లు సాధించారు. చదరంగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా షణ్ముఖ ఎర్రుపాలెం, కె.వర్షిత ఇల్లందు, జి.హర్షిత అడవిమల్లెల సాధించారు. క్యారమ్స్ డబుల్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు వరుసగా పి.సుకన్య, స్వర్ణమనీష్ కూసుమంచి, ఎస్.వింధ్య, ఎం.ప్రణీత ఎర్రుపాలెం సాధించారు. అండర్17 విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా టి.రేష్మా(వైరా), సిహెచ్.వెన్నెల ఇల్లందు, జి.మంజుని కల్లూరు సాధించారు. 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా టి.రేష్మా వైరా, సిహెచ్.వెన్నెల ఇల్లందు, ఎం.హర్షిని ఇల్లందు, 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా కైలా సాయిశ్రీ ముల్కలపల్లి, టి.మానస ఇల్లందు, పి.హర్షిత మధిర సాధించారు. 3000 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా అఖిల సాయిశ్రీ ములకలపల్లి, మానస ఇల్లందు, ఏ.సాక్షిత ములకలపల్లి సాధించారు. షాట్‌పుట్‌లో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా టి.ఉమారాణి అడవిమల్లెల, డి.స్వాతి కూసుమంచి, ఏ.సంజన ఎర్రుపాలెం సాధించారు. లాంగ్‌జంప్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా సిహెచ్.వెన్నెల ఇల్లందు, టి.రేష్మా వైరా, ఎం.హర్షిని ఇల్లందు సాధించారు. చదరంగంలో ప్రథమ, ద్వితీయ జి.హర్షిత అడవిమల్లెల, సౌమ్యశ్రీ నేలకొండపల్లి బహుమతులు వరుసగా సాధించారు. క్యారమ్స్ డబుల్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు వరుసగా డి.హర్షిత, సాత్విక కల్లూరు భద్రాచలం సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు సంక్షేమ గురుకులాల జోనల్ అధికారి ఎస్.విద్యారాణి, వైరా గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సమత, ఇతర గురుకులాల ప్రిన్సిపాల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో గన్ని సంచులు కొరత

**ఆందోళనలో రైతులు**



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు కొనుగోలు కేంద్రాలలో గన్ని సంచులు కొరతతో గత నాలుగు రోజుల నుంచి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుపుతున్నారు. మండల పరిధిలోని కల్లూరు, చెన్నూరు సొసైటీలలో పరిధిలో కొరత వలన కొనుగోలు మందగించాయని రైతులు తెలుపుతున్నారు. మండల పరిధిలోని 33,400 ఎకరాలలో వరి పంట సాగు చేస్తుండగా ఈ సంవత్సరం తుఫాను ప్రభావం ఎరువుల కొరత, గోనె సంచులు కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని జిడిపి పల్లి లో రైతులు గోనె సంచుల కోసం రోడ్డు ఎక్కి ఆందోళన చేశారు. కల్లూరు సొసైటీ, చెన్నూరు సొసైటీ, లలో గోనె సంచులు కొరతతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తేమశాతం అనుకూలంగా వచ్చిన బస్తాలలో కాంట వేసేందుకు రైతుల సిద్ధం చేయగా సంచులు లేనందున అమ్మకాలు ఆలస్యంగా జరుగుతున్నాయని రైతులు తెలుపుతున్నారు. తుఫాను ప్రభావం ఎరువుల కొరత ఆపై ఎండి తెగులు ఆకు తెగులు చీడపీడలతో ఈ సంవత్సరం దిగుబడి అంతంత మాత్రమేనని ఇదే సమయంలో గన్ని సంచుల కొరతతో ఇదే అదునుగా నేల బురదగా ఉండటంతో కోత యంత్రం వారు అదనపు ధరలను పెంచేశారు. రైతుకు అన్నీ కష్టాలేనని రైతులు వాపోతున్నారు. ఈ సంవత్సరం పెట్టుబడి వచ్చేనా అంటూ రైతులు దిగాలు పడుతున్నారు. మండల పరిధిలోని జిడిపి పల్లి, వాచ్యానాయక తండా, చంద్రుపట్ల, రఘునాధగూడెం, ఎర్రబోయినపల్లి, కల్లూరు, లింగాల, చెన్నూరు తదితర గ్రామాలలో ఇదే పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల రైతులు తెలుపుతున్నారు. త్వరగా త్వరితగతిన రైతులకు గన్ని సంచులు అందించి ఆదుకోవాలని అధికారులను రైతులు కోరుతున్నారు.

# స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం నినాదం కీలకమైంది



**ప్రజాపక్షం/వైరా:** భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం నినాదం బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేయడంలో చాలా గొప్ప ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందని వైరా పట్టణంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నవీనజ్యోతి తెలిపారు. వందేమాతరం గేయాన్ని బకించంద్ర చటర్జీ రచించి 150 సంవత్సరాలు సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల ప్రకారం శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వందేమాతర గేయాన్ని టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థిని, విద్యార్థులు అందరూ ప్రభుత్వం వారి ఆదేశాలకు అనుకూలంగా ఉదయం 10గంటలకు ఆలపించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల చరిత్ర అధ్యాపకురాలు రజియా సుల్తానా మేడం రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమంలో ప్రజలందరిని ఐక్యం చేయడంలో వందేమాతరం నినాదం చాలా ప్రేరణగా నిలిచిందని తెలిపారు. బ్రిటీష్ వారు భారతీయులు ఐక్యతను దెబ్బతీయడానికి కుట్రపూరితంగా బెంగాల్ విభజన చేస్తున్న సందర్భంలో హిందూ, ముస్లీంలు అందరూ కలిసి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా వందేమాతరం నినాదంతో దేశవ్యాప్త ఉద్యమం చేశారని తెలిపారు. 1950లో భారత రాజ్యాంగ సభ వందేమాతారాన్ని జనగణమన గీతంతో పాటు సమాన గుర్తింపు ఇచ్చిందని తెలిపారు. భారతదేశ పౌరులందరూ వందేమాతర గీతాన్ని గౌరవించాలని కోరారు.

# భారతావాణిలో స్ఫూర్తి నింపిన వందేమాతరం



**ప్రజాపక్షం/ తల్లాడ :** వందేమాతరం గీతం యావత్ భారతదేశంలో స్ఫూర్తిని నింపిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏనుగు సురేష్ బాబు తెలిపారు. 1975 నవంబర్ ఏడున బంకించంద్ర చటర్జీ రచించిన ఆనంద మఠ్ నవలలో ఈ గీతాన్ని తొలిసారి ప్రచురించడం జరిగిందన్నారు. ఈ గీతం స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించడంలోనూ, దేశ ప్రజల్లో ఐక్యత పెంపొందించడంలోనూ విశేషంగా దోహదపడిందన్నారు. వందేమాతర గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తల్లాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వందేమాతర గీతాన్ని శుక్రవారం ఆలపించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ 150 ఏళ్ల వందేమాతర గీతం ఇప్పటికీ ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. విశేష అర్థాలు, విశిష్ట సారాంశంతో కూడిన ఈ గీతం నిత్య నూతనమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ ఈవో కృష్ణారావు, సిబ్బంది మధుకర్‌రెడ్డి, స్టాలిన్, ఖాజామోహినుద్దీన్, పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు సామినేని రామారావు సంస్మరణ సభ

**-హాజరు కానున్న రాఘవులు, తమ్మినేని, బాగం**



**ప్రజాపక్షం/ చింతకాని :** సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు, పాతర్లపాడు గ్రామ మాజీ సర్పంచ్ ఇటీవల హత్యకు గురైన సామినేని రామారావు సంస్మరణ సభ శనివారం ఉదయం తొమ్మిది గంటలకు పాతర్లపాడు గ్రామంలో జరుగుతుందని సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, పోతినేని సుదర్శన్ లతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని గోపాలరావు తెలిపారు.

# రాష్ట్ర కళా ఉత్సవ్‌లో సత్తా చాటిన శ్రీ వైష్ణవి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర కళా ఉత్సవ్ 2025 లో గిన్నారపు సేవిత శ్రీ వైష్ణవి సత్తా చాటింది. భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ నవభారత్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న శ్రీవైష్ణవి రాష్ట్ర కళా ఉత్సవ్ పాటల పోటీలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన శ్రీవైష్ణవి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం పొందడం అభినందనీయం. పిడిలు నవీన్ నిక్సోన్, రాధారెడ్డి చేతుల మీదుగా జ్ఞాపికను, ధృవపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవైష్ణవి తల్లిదండ్రులు నాగేందర్, అంబిక లు మాట్లాడుతూ మా కుమార్తె చదువుతో పాటు పాటలు పాడటంలో కూడా ప్రతిభ కనబరుస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. శ్రీ వైష్ణవికి నవభారత్ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

ఫోటోలు ఉన్నాయి

# పోలీసుశాఖ ఆధ్వర్యంలో 'వందేమాతరం'

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జాతీయ గేయం 'వందేమాతరం ' నికి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సామూహిక ఆలపన కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీసు పెరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించారు. పోలీసు కమిషనర్ సునీల్‌దత్ నేతృత్వంలో జరిగిన ఈ గీతాలాపనలో కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసుస్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, డిసిపిలు, ఏసిపిలు, ఏఆర్ సిబ్బంది పాల్గొని వందేమాతరం ఆలపించారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో ప్రజలను చైతన్యం చేసి స్ఫూర్తినిచ్చేందుకు వందేమాతరం గీతం ఎంతో దోహదం చేసిందని సిపి పేర్కొన్నారు. ఏడాదిపాటు ఈ వేడుకలు దేశవ్యాప్తంగా జరుగనున్నాయని ఆయన తెలిపారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖానాపురం హవేలి పోలీసు స్టేషన్‌పరిధిలోని గోపాలపురం లోని ఒక దాబా వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని సిఐ భానుప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెంది ఉంటాడని అనుమానిస్తున్నామన్నారు. స్థానికుల సమాచారం మేరకు శుక్రవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి అనంతరం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురికి తరలించినట్లు తెలిపారు. మృతుడు సుమారు 22 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, గళ్ల టీషర్టు ధరించి ఉన్నాడని, అతని వివరాలు తెలిసిన వారు ఎవరైన ఉంటే స్థానిక పోలీసు స్టేషన్‌లో కాని సెల్ నెంబర్లు 8712659122, 8712659120, 8712659119 లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

# మూడు విద్యుత్ స్తంభాల వైరు చోరీ

**ప్రజాపక్షం/కామేపల్లి :** మండలంలోని రామకృష్ణాపురం గ్రామ సమీపంలో పంట చేనులో ఉన్న వ్యవసాయ విద్యుత్ స్తంభాల వైర్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటన మండలంలోని రామకృష్ణాపురం గ్రామ సమీపంలోని ఆ గ్రామానికి చెందిన రైతు ఆంగోత్ లక్ష్మణ్ పంట చేనులో పత్తి మిర్చి తోట వేశాడు. అతని వ్యవసాయ బాయి నుండి పంట చేనుకు నీరు పెట్టడానికి విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన పోల్స్‌పై ఉన్న తీగను గురువారం రాత్రి దొంగలు దొంగిలించారు. శుక్రవారం ఉదయం పంట చేనుకు వెళ్లిన రైతు లక్ష్మణ్ చోరీ జరిగిన విషయాన్ని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. దీనిపై విచారణ జరిపి రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఏఈ శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు.